డ్రైనేజీ పనుల ప్రారంభం

శంషాబాద్ రూరల్: కవేలిగూడ చౌరస్తా వద్ద భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. వరదనీటితో పాటు మురుగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన అన్నారు. అంతకుముందు ఆయన పరిసర ప్రాంతాలను పరిశీలించి సమస్యను తెలుసుకున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఉప్పర్‌పల్లి ప్రైమరీ స్కూల్‌లో క్లే పాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాగులు, మెడల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చదువుల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, క్లే పాట్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్ కోసం 'ఫేస్ రికగ్నైజేషన్'



సాఫ్ట్‌వేర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోస్టు ఆఫీస్‌లలో ఫేస్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా జరుగుతున్న చేయూత పింఛన్‌ల పంపిణీ ప్రక్రియను కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. హైదర్షాకోట్, బండ్లగూడ, కిస్మత్‌పూర్‌లలోని పోస్టు ఆఫీస్‌లలో ఫేస్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. వీలైనంత త్వరగా ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియను పూర్తి చేయిస్తామని తెలిపారు. ఏఎంసీ డి.చంద్రశేఖర్, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

రాజేంద్రనగర్: ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నేతలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఆ పార్టీ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని డెయిరీ ఫామ్ చౌరస్తా వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి రూ. 4 వేలు, సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి విద్యార్థులను మభ్యపెడుతున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు కట్టెలమండి గౌతమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్ ధోని, జనరల్ సెక్రటరీ అఖిరానందన్, డివిజన్ అధ్యక్షుడు నిష్కల్ రెడ్డి, నేతలు శివ, అభినవ్, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



బైరాగిగూడలో మొక్కలను పంపిణీ చేస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1, 2, డివిజన్‌లోని బైరాగిగూడలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికీ వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఏఎంసీ డి.చంద్రశేఖర్, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, ఆర్‌వో కె.శివకుమార్, గణేష్, అజీమ్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పచ్చదనం.. ప్రజల భాగస్వామ్యం...

వన మహోత్సవాన్ని విజయవంతం చేసే దిశగా అడుగులు

- నాటేందుకు సిద్ధంగా 2.30 లక్షల మొక్కలు
- త్వరలో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం



మైత్రి కాలనీలోని నర్సరీల్లో పలు రకాల మొక్కలు



నర్సరీలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న జామ మొక్కలు

బండ్లగూడ: వనాలు పెంచే ఉద్దేశంతో అధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు చేపట్టిన వనమహోత్సవం విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పెంచడానికి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మైత్రి కాలనీలో ఏర్పాటు చేసిన నర్సరీలో పెద్ద ఎత్తున మొక్కలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నర్సరీలలో పెంచిన మొక్కలు ఏపుగా పెరిగి నాటేందుకు తయారయ్యాయి.

అనువైన స్థలాలను గుర్తించి...

కార్పొరేషన్ పరిధిలో మొక్కలను నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించారు. ఖాళీగా ఉన్న పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల గట్లపై ఉన్న ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు, పట్టణ ప్రకృతి వనాలు, పలు కాలనీలలో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్ల పక్కన ప్రధాన రహదారి పొడవునా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటుతున్నారు.

1.10 ఎకరాల్లో మొక్కలు పెంచుతూ..

కిస్మత్‌పూర్‌లోని మైత్రి కాలనీ ఈసీ వాగు సమీపంలో నీరు ఉండి అనువైన 1.10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచుతున్నారు. గత సంవత్సరం 1.70 లక్షలకు పైగా మొక్కలను నాటారు. నాటిన మొక్కలు ఇప్పుడు పచ్చదనం, పరవళ్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందిస్తున్నాయి.



ఎక్సైజ్ అకాడమీ రోడ్డులో మొక్కలు నాటుతున్న దృశ్యం

2.30 లక్షల మొక్కలు నాటాలి...

ఈ సంవత్సరంలో ఏర్పాటు చేసిన నర్సరీలో 2.30 లక్షలకు పైగా మొక్కలను పెంచారు. అందులో పూలు, పండ్ల మొక్కలు ఇంటింటికీ పంపిణీ చేసేవి. మిగతా మొక్కలు అవెన్యూ ప్లాంటేషన్ రోడ్లకు ఇరువైపులా, పార్కులలో నాటేందుకుకి ఉపయోగిస్తారు. ఇప్పటి వరకు కొంత మేర మొక్కలను పంపిణీ కూడా చేశారు.

పచ్చదనంతోనే మనుగడ



మొక్కల నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందిస్తేనే మానవ మనుగడ సాధ్యం అనడం నిర్వివాదాంశం. పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు కార్పొరేషన్ పరిధిలోలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గతంలో నాటిన మొక్కలు పెరిగి పచ్చదనంతో అలరారుతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలి. అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేసి వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం.

- బచ్చలకూరి శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్

నర్సరీల్లో రకరకాల మొక్కలు...

నర్సరీలో పలు రకాల మొక్కలు ఉన్నాయి. మందారం, గులాబీ, కనకాంబరం, నిమ్మ, నేరేడు, అశ్వగంధ, బొప్పాయి, ఉసిరి, మునగ, సీతాఫలం, చైనా బాదం, జామ, తులసి, టేకు తదితర మొక్కలను పెంచుతున్నారు. మొక్కలకు నీరు పోసేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి మొక్కా ఎదిగే విధంగా చర్యలు తీసుకున్నారు. వేసవిలో మొక్కలు, చెట్లు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలి



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఈ సంవత్సరం నిర్దేశించిన లక్ష్యంకన్నా అధికంగా వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రత్యేకాధికారి హరి రతన్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో గేటెట్ కమ్యూనిటీలు, టవర్‌ల నిర్మాణంతో పాటు కొత్త కాలనీలు అనేకం వస్తున్నాయన్నారు. అందుకు అనుగుణంగానే మొక్కలను పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే రోజుల్లోనూ కళాశాలతో పాటు పాఠశాలలు, పార్కులలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, డీఈ నరేష్, ఏఈ శ్రీనివాస్, శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌలిదొడ్డిలో ఘనంగా బోనాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గౌలిదొడ్డిలో ఆదివారం రాత్రి ఘనంగా బోనాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు సామూహికంగా బోనాలతో దేవాలయాలకు చేరుకుని గ్రామదేవతలకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన తొట్టెల ఊరేగింపులో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తీన్మార్ స్టెప్పులతో అంగరంగ వైభవంగా దేవాలయాలకు చేరుకుని తొట్టెలను సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, వట్టినాగుపల్లి మాజీ ఎంపీటీసీ నగేష్‌యాదవ్, స్థానిక నేత ప్రభాకర్‌లతో పాటు పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న అశోక్‌యాదవ్, మల్లేష్ ముదిరాజ్

'జీఐఎల్‌టీ'లో స్పాట్ అడ్మిషన్స్

రాయదుర్గం: లెదర్ టెక్నాలజీలో తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక పాలిటెక్నిక్ కళాశాలగా గుర్తింపు పొందిన గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో ఖాళీ సీట్ల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం 'స్పాట్ అడ్మిషన్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపాల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ సోమవారం తెలిపారు. జీఐఎల్‌టీలో సీటు పొందాలంటే పాలిసెట్ అర్హత సాధిస్తేనే అవకాశం ఉండేది. కానీ పదవ తరగతి పాసైనా సీటు కేటాయించి ఖాళీ సీట్లను భర్తీ చేయాలని ఆదేశించారని ఆయన వివరించారు.

నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఫ్యాకల్టీ ప్రతినిధులు

రాయదుర్గం: విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని అందించడమే కాకుండా ఆవిష్కరణ, స్వావలంబనను కూడా ప్రారంభించాలని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ ఆహ్మద్ సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ-ఎంఎంటీటీసీలో నిర్వహించిన స్వావలంబన మహిళా వ్యవస్థాపక కార్యక్రమం కింద కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ సహకారంతో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ఫలదాయకమైన కెరీర్‌ను అన్వేషించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌ఐఈఎస్‌బీయూడీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ యామినిజైస్వాల్, యూజీసీ-ఎంఎంటీటీసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మెరాజ్ అహ్మద్‌ముబార్కి, డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు

రాయదుర్గం: శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గచ్చిబౌలిలోని అన్ని శైవ ఆలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగర్‌కాలనీ: దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, విశ్వక్సేన పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, అంకురార్పణం, వయినతేయ ధ్వజ ఛాయాదివాసం, మంగళ శాసనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులు సామల శ్రీనివాస్, బి.రమేష్‌కుమార్, దాస శ్రీనివాస్, పూజోలు అంజయ్య యాదవ్, జి.వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి పూజలు..

బ్రహ్మోత్సవాల్లో 3వ రోజు మంగళవారం లంగర్‌హౌస్ ముచ్‌కుందానది వీర రాఘవ రామాలయం పండితులు రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుంది. సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందజేస్తారు. రాత్రి భవానీశంకర ఆలయ భజన మండలి వారిచే భజన కార్యక్రమం ఉంటుంది.

బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే గాంధీ



క్రికెట్ ఆడుతున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ బీస్ కిడ్స్ స్టూడియోను పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ క్రికెట్ బ్యాట్ కనిపించేసరికి తీసుకొని దాన్ని పట్టుకొని సరదాగా క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రదర్శనలను తిలకిస్తున్న హెచ్‌ఎం తదితరులు

మణికొండ: విద్యార్థులు తమ చదువులతో పాటు వివిధ అంశాల్లో స్కిల్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ అన్నారు. సోమవారం పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు డిజిటల్, లైఫ్ స్కిల్స్ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ... పుస్తకాలలో ఉండే ఆవిష్కరణలను ఇలా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే వారికి మనసులో నాటుకుపోతుందన్నారు. అలాంటి వాటిపై ఎలాంటి ప్రశ్నలు వేసినా జవాబులు చేప్పే స్థాయిలో విద్యార్థులు ఉంటారన్నారు. గత మూడు సంవత్సరాలుగా మ్యాజిక్ ఇండియా విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలను ఏర్పాటు చేస్తుందన్నారు. వాటితో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కొత్త ఆలోచనలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు పెంపొందుతున్నాయన్నారు. ఇలాంటి సంస్థలు పేద విద్యార్థులకు అండగా నిలవటం ప్రశంసనీయమన్నారు. మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు తృప్తినిస్తాయి

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి



చెక్కులను అందించిన కార్తీక్‌రెడ్డి

మణికొండ: సేవా కార్యక్రమాలు మానసిక తృప్తితో పాటు ప్రజల్లో గుర్తింపు తెస్తాయని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్నత మార్కులు సాధించి ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు మణికొండ మున్సిపాలిటీ అధికార ప్రతినిధి బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి వారి ఇంటర్ మొదటి సంవత్సరం ఫీజులను ఆయన చేతుల మీదుగా చెల్లించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ... పేద విద్యార్థులకు చేసే ఇలాంటి సహాయాలను జీవితాంతం గుర్తుంచుకుంటారని, అలాంటి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. తరచూ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించే ఉపేంద్రనాథ్‌రెడ్డిని ఆయన అభినందించారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఉపాధ్యక్షుడు ఎ.లక్ష్మణ్‌రావు, నాయకులు రామసుబ్బారెడ్డి, షేక్ ఆరీఫ్ మహమ్మద్, సుమ నళిని తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్: సీపీఐ తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. ఆగస్టు 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో నిర్వహించనున్న మహాసభలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక విధానాలు, ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, రామస్వామి, ఒరుగంటి యాదయ్య, ప్రభులింగం, జంగయ్య, పల్నాటి యాదయ్య, యాదగిరి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి తదితరులు

బండ్లగూడ: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం.. ఆరోగ్యకరం అని అంగన్‌వాడీ టీచర్ వి.నాగలక్ష్మి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-2లో జాతీయ తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు (ముర్రు పాలు) తప్పనిసరిగా తాపాలని.. అలాంటప్పుడే బిడ్డ చురుకుగా.. ఆరోగ్యకరంగా.. హుషారుగా ఉంటారన్నారు. తల్లి పాలు తాగిన బిడ్డ వ్యాధులకు గురికాకుండా ఉంటారన్నారు. తల్లి పాలు అమృతం వంటివి.. బిడ్డకు మొదటి టీకా తల్లిపాలు అన్నారు. తల్లులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆశావర్కర్ జి.విజయ, డాక్టర్ సంకీర్తనగౌడ్, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ సత్తాచాటాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాముఖ్యతను ఇస్తూ రాణించాలని మహవీర్ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహవీర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో దివంగత సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో అండర్-11, 12 పోటీల ఫైనల్స్ సోమవారం జరిగాయి. గెలుపొందిన క్రీడాకారులకు నగదు పారితోషకంతో పాటు సర్టిఫికెట్స్‌ను తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ నెల 5, 6వ తేదీలలో అండర్ 15 బాయ్స్, గర్ల్స్ ర్యాంకింగ్ టోర్నమెంట్ కళాశాల ఇండోర్‌లో నిర్వహిస్తున్నట్లు జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి తెలిపారు. కళాశాల చైర్మన్ ఎస్.జయలక్ష్మి, కోశాధికారి అగ్నిహోత్రి, చీఫ్ రెఫరీ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

అండర్-11 గర్ల్స్, బాయ్స్ సింగిల్స్‌లో విన్నర్ యశశ్రీ, రన్నర్‌గా వి.అపర్ణ, ఎం.విహాన్, శుభండై, అండర్-13 గర్ల్స్, బాయ్స్ సింగిల్స్‌లో విన్నర్‌గా డి.అవంతిక, రన్నర్‌గా రాధితోరో, రన్నర్‌గా విరాట్ సాగర్, రన్నర్‌గా వి.శ్రీసాయిశివ అద్విక్, అండర్-15 గర్ల్స్, బాయ్స్ సింగిల్స్‌లో విన్నర్‌గా కె.శ్రీశాన్వి, రన్నర్‌గా డి.అవంతిక, విన్నర్‌గా బి.హర్షిత్‌రెడ్డి, రన్నర్‌గా సుహాస్ రత్నం, అండర్-17 గర్ల్స్, బాయ్స్ సింగిల్స్‌లో విన్నర్‌గా శ్రీశాన్వి, రన్నర్‌గా ఎస్.గాయత్రీకృష్ణ, విన్నర్‌గా ధర్మతేజ, రన్నర్‌గా దేవాంష్‌సింగ్, అండర్-19 గర్ల్స్, బాయ్స్ సింగిల్స్‌లో విన్నర్‌గా కె.శ్రీశాన్వి, రన్నర్‌గా హెచ్.ఎస్.నికిత, విన్నర్‌గా కె.తరుణ్‌కేథర్‌నాథ్, రన్నర్‌గా అరూష్‌రెడ్డి, ఉమెన్స్ సింగిల్స్‌లో విన్నర్‌గా నికిత, రన్నర్‌గా లక్ష్మీహర్షితలు గెలుపొందారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి



డీసీ సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాలనీ అసోసియేషన్, ప్రజాప్రతినిధులు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సురేందర్‌రెడ్డిని సోమవారం సర్కిల్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చితాతరి, చిట్టిరి నరేందర్ కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీసీ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో రోజూ పర్యటించి ప్రధానంగా వర్షాకాలంలో ప్రజలు వరదనీటికి ముంపు కాకుండా పనులు చేపట్టడంతో పాటు పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. నాయకులు కొలన్ సుధాకర్‌రెడ్డి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.